క్లుప్తంగా

వైభవంగా మహాచండీయాగం



కోడూరు: కోడూరు గ్రామంలో గంగాభవానీ అమ్మవారి 50వ వార్షిక జాతరోత్సవాలను పురస్కరించుకొని గురువారం మహాచండి యాగం నిర్వహించారు. ఉదయం చిన్నఅమ్మవారి విగ్రహానికి కలశపూజలు, పుష్పాభిషేకాలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఉభయదాతలు డప్పువాయిద్యాల నడుమ మహాపూర్ణాహుతి సామగ్రిని ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం గర్భాలయంలోని గంగాభవానీ అమ్మవారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని త్రిశూలధారిణిగా అలంకరించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లబ్ధిదారులు అందరికీ రుణాలు ఇవ్వాలి



చిలకలపూడి(మచిలీపట్నం): బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు అందరికీ రుణాలు ఇవ్వాలి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం అందజేశారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రుణం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘ నాయకులు జోగి శివ, బెల్లంకొండ రవి, ధనికొండ చిన్ని, భోగిరెడ్డి సుభానీ, పెద్దిబోయిన సాంబ, గోపి, చేబోయిన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 25 మందికి ప్రభుత్వం సరఫరా చేసిన టెస్ట్ బుక్స్, నోటు పుస్తకాలను ప్రిన్సిపాల్ ఎన్ నరసింహారావు గురువారం అందజేశారు. అధ్యాపకులు దుడ్డు కృష్ణారావు, దిలీప్‌కుమార్, సురేష్, శ్రీధర్, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, రవి పాల్గొన్నారు.

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ ప్లస్ 2 విద్యార్థులకు గురువారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. హెచ్ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి ఆధ్వర్యంలో శ్రీకాకుళం, తెలుగురావుపాలెం సర్పంచులు ముప్పనేని రవి ప్రసాద్, రాచూరి ప్రసాద్ బాబుల చేతుల మీదుగా విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు.

నేడు బాలోత్సవ్

కోడూరు: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాలోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంఈఓ టీవీఎం రామదాసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కార్యక్రమం ఉంటుందని చెప్పారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాల్లో విద్యా విషయక, క్రీడా, సాంస్కృతి అంశాల్లో ప్రతిభ కనబర్చిన వెయ్యి మంది విద్యార్థులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జిల్లా కలెక్టర్ బాలాజీ, డీఈఓ రామారావు ఈ వేడుకల్లో పాల్గొని బహుమతులు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.1లక్ష విరాళం



చల్లపల్లి: స్థానిక ఒకటవ వార్డులోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి గౌడ సంఘం నాయకులు గురువారం రూ.1లక్ష విరాళాన్ని స్వచ్ఛ సుందర చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్‌కు అందజేశారు. విరాళం అందజేసిన వారిలో గౌడ సంఘం అధ్యక్షుడు వేముల అర్జునరావు, వేముల శేషగిరిరావు, ఉప్పాల ఏడుకొండలు, జన్ను సాంబయ్య, మార్గాని వెంకటేశ్వరరావు, వేముల వెంకట శివ ఉన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌కే ప్రసాద్ గౌడ సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

నాగాయితిప్ప(మోపిదేవి): మండలంలోని నాగాయితిప్ప గ్రామంలో అరటి తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను గురువారం చల్లపల్లి పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసి స్పెషల్ టీం సాయంతో పట్టుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. జూదరుల నుంచి రూ. 5,420లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆస్తి పన్నులో అంతులేని నిర్లక్ష్యం

- పలు ప్రభుత్వ కార్యాలయాలకు పన్ను లేదు
- విమర్శలకు తావిస్తున్న పురపాలక సంఘ అధికారుల తీరు



హడావుడిగా ఆస్తి పన్ను కోసం కొలతలు వేస్తున్న సచివాలయ ఉద్యోగులు

పెడన: పురపాలక సంఘ అధికారుల పనితీరు విమర్శలకు తావిస్తోంది. పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు ఆస్తి పన్ను వేస్తూ మరి కొన్నింటిని ఏళ్ల తరబడి వదిలేయడం విశేషం. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఆస్తి పన్నులు ఎంతెంత రావాలనే దానిపై మున్సిపల్ అధికారులు ఆరా తీశారు. 2024–25 ఆర్థిక ఏడాది ముగుస్తున్న తరుణంలో వాటి జాబితాలను బయటకు తీశారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన వాటి నుంచి కూడా ఆస్తి పన్ను వసూళ్లు చేస్తున్నారు. కాని కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు పట్టణంలో కనిపిస్తున్నా వాటి నుంచి ఆస్తి పన్నులు వసూళ్లు చేయడం లేదు. వాటికి ఎందుకని ఆస్తి పన్ను వేయలేదని తెలిసి అప్పటికప్పుడు సచివాలయ ఉద్యోగులు వెళ్లి కొలతలు వేయడం విశేషం.

ఆస్తి పన్ను లేని పలు కార్యాలయాలు

పదేళ్ల కిందట గృహ నిర్మాణ శాఖ ఆ శాఖ నిధులతో సొంత కార్యాలయాన్ని నిర్మించారు. హౌసింగ్ రూరల్ కార్యాలయంగా నామకరణం చేసి అందులో అర్బన్‌తో పాటు రూరల్ కార్యాలయం విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయానికి ఎటువంటి పన్నులు వేయడం లేదు. దీని పక్కనే బీసీ వసతి గృహం ఉంది. అందులో పిల్లలు లేక ఖాళీగా ఉండటంతో తహసీల్దారు కార్యాలయం వారు కిందనున్న గదులను వినియోగించుకుంటున్నారు. 2017లో అప్పటి జిల్లా కలెక్టర్ వెలుగు వారికి వసతి గృహంలోని పైభాగాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. పురపాలక ఆస్తి



ఆస్తి పన్ను వేయని హౌసింగ్ కార్యాలయం

పన్ను నిబంధనల మేరకు వసతి గృహానికి మినహాయింపు ఇచ్చారు. ప్రస్తుతం వసతి గృహం లేదు కాబట్టి ప్రభుత్వ కార్యాలయాలు నడుస్తుండటంతో వాటికి పన్నులు వేయాల్సి ఉంది.

పన్ను బకాయిలు

పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు ఆస్తి పన్ను బకాయిలు పడ్డాయి. ఎంపీడీవో కార్యాలయం సుమారు రూ.17లక్షలు పన్ను బకాయి ఉంది. అలాగే తహసీల్దారు కార్యాలయం రూ.8లక్షలు, పోలీస్ స్టేషన్ రూ.లక్ష వరకు బకాయిలు ఉన్నాయి. ఇక బీఎస్ఎన్ఎల్, వ్యవసాయ మార్కెట్ యార్డు, పీఏసీఎస్‌లు బకాయిలు లేకుండా చెల్లిస్తున్నాయి.

పునఃపరిశీలన చేస్తాం



బదిలీపై పురపాలక సంఘానికి రాకముందు నుంచి ఉన్న వాటిని, కొత్తగా నిర్మిస్తున్న వాటికి పన్నులు సక్రమంగా కట్టించుకుంటున్నాం. పాతవాటి విషయంలో మాకు అంతగా అవగాహన లేదు. క్షేత్రస్థాయిలో పన్నులు వేసే బాధ్యత సచివాలయ అడ్మిన్లదే. ఈ విషయంలో పునఃపరిశీలన చేసి ఆస్తి పన్నులు వేయడం జరుగుతుంది.

పీ వెంకటేశ్వరరావు,
ఆర్ఐ, పురపాలక సంఘం, పెడన

పీఏసీఎస్‌లో నిధుల దుర్వినియోగంపై విచారణ



మాట్లాడుతున్న విచారణ అధికారి మహమ్మద్ గౌస్

నాగాయలంక: నాగాయలంక పీఏసీఎస్‌లో నిధుల దుర్వినియోగంపై సొసైటీ సభ్యుల(రైతుల)తో విచారణ చేపట్టారు. విచారణ అధికారి మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా రికార్డులు పరిశీలిస్తున్నారు. విచారణాధికారి గౌస్ గురువారం మాట్లాడుతూ సొసైటీలో రూ. 13.50 లక్షల తేడాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీనిలో సంఘ సీఈఓ వీర్నాల టోనీ కేవలం రూ.90వేలు మాత్రం కట్టి మిగతావి కట్టకపోవడంతో సదరు సీఈఓను విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. సొసైటీలో రుణాలు పొందిన సుమారు 800మంది రైతులను విచారించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 120మందిని విచారణ చేశామని తెలిపారు. రుణాలు తీసుకున్న అందరూ బ్యాంకుకు వచ్చి విచారణకు సహకరించాలని కోరారు. కేడీసీసీ బ్రాంచి చీఫ్ మేనేజర్ చింతలపూడి మధు, సంఘ పర్సన్ ఇన్‌చార్జి కన్నా రాంబాబు, సొసైటీ ఇన్‌చార్జి సీఈఓ కేవీ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

మచిలీపట్నంటౌన్: 'నగరపాలక సంస్థకు తాగునీటి కష్టాలు' అనే శీర్షికతో గురువారం సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంఎంసీ కార్యాలయంలోని ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురికావడంతో గత 20 రోజులుగా కార్యాలయంలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ సమస్యపై స్పందించిన ఏఈ గోపిశెట్టి శేఖర్ ఆర్వో ప్లాంట్ వద్ద నూతన మోటార్‌ను బిగించే పనులను చేయించారు. మిగిలిన పనులను పూర్తి చేసి త్వరలోనే తాగునీటిని అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

మోపిదేవి: మోపిదేవి సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు తాగునీరు సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. దివీస్ లేబరేటరీస్ వారి ఆర్థిక సౌజన్యంతో రెండు జల ప్రసాదం ప్లాంట్లు టీటీడీ కల్యాణ మండపం, నూతనంగా నిర్మిస్తున్న వసతిగృహ సముదాయం ప్రాంతాల్లో గురువారం శంకుస్థాపన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ, ఆలయ సూపరిటెండెంట్ అచ్యుత మధుసూదనరావు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

- **మట్టి నమూనాపై అవగాహన**

పెడన: మండల పరిధిలోని కమలాపురం గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పంట పొలాల్లో పర్యటించి మట్టి నమూనాలు సేకరణ, వాటిలో స్థూల, సూక్ష్మక పోషకాలు తెలుసుకునే విధానంపై గురువారం అవగాహన కలిగించారు. ఈ పరీక్షల ద్వారా రైతులు పంటలో ఏ మోతాదులో రసాయన, సేంద్రీయ ఎరువులు వినియోగించి ఖర్చులు ఎలా తగ్గించుకోవచ్చునో వివరించారు. శాస్త్రవేత్త డాక్టరు వెంటకలక్ష్మి, వీఏఏ పద్మావతి, పాల్గొన్నారు.

- **కృష్ణాజిల్లా బీఎస్పీ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు**

కొడాలి(ఘంటసాల): కృష్ణాజిల్లా బహుజన్ సమాజ్ పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా అవనిగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జి ఘంటసాల మండలం కొడాలి గ్రామానికి చెందిన గుంటూరు నాగేశ్వరరావు నియమితులయ్యారు. విజయవాడలోని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతం కుమార్ ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు నాగేశ్వరరావుకు నియమిస్తూ నియామక పత్రాన్ని అందించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నాగేశ్వరరావును జిల్లా బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు సత్కరించారు.

- **రేపు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి**

చిలకలపూడి(మచిలీపట్నం): డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఈ నెల 5వ తేదీన సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ శాఖ డీడీ షేక్ షాహెద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటలకు నగరంలోని మల్కాపట్నం సెంటరులో ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్పాలంకరణ చేసిన అనంతరం జిల్లా పరిషత్ సమావేశపు హాలులో సభా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

- **జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతం**

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం సెషన్‌లో 58 మందికి 54 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 59 మందికి 54 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు.

- **నాటు సారా స్వాధీనం**

పెడన: పెడన మండలం కోటవానిపాలెం గ్రామంలో గురువారం పోలీసులు నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ కథనం మేరకు విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎం. రామశేషయ్య సిబ్బందితో గురువారం గ్రామంలో దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన గంజాల మీనాక్షి వద్ద నుంచి నాలుగు సారా బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమెను విచారించగా కాకర్లమూడి గ్రామానికి చెందిన పేరం బోగారావు అనే అతను సారా సరఫరా చేసినట్లు చెప్పడంతో ఇరువురిపై కేసు నమోదు చేశారు.

- **ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ**

బంటుమిల్లి: మండల పరిధిలోని సాతులూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారి ఆలయంలో ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. ఆలయ ట్రస్టీ చిట్టా పవన్‌కుమార్ పర్యవేక్షణలో పండితులు సోమరాజుపల్లి ఈశ్వరశర్మ శిష్య బృందం వేద మంత్రాల మధ్య స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజ స్తంబ ప్రతిష్ఠ నిర్వహించారు.

- **మట్టి అక్రమ తవ్వకాలు చేస్తే చర్యలు**

నాగాయలంక: మట్టి అక్రమ తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కలిదిండి రాజేష్ పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మండలంలోని నంగేగడ్డ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి మట్టి తరలిస్తున్న జేసీబీని పట్టుకుని మండల గురువారం తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వెళ్లి నంగేగడ్డ వద్ద జేసీబీ యజమాని, డ్రైవర్ అయిన చెన్ను పూర్ణ చంద్రరావు మట్టి తరలిస్తుంటే అడ్డుకున్నట్లు వివరించారు.

- **ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ**

కృత్తివెన్ను: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కృత్తివెన్ను మండలం ఒర్లగొందితిప్ప గ్రామంలో గురువారం జరిగింది. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణల చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని దేశానికి చాటి చెప్పడంలో ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. స్థానిక పెద్దలు, ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ చల్లపల్లి పరిశీలన

చల్లపల్లి: స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమాలను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ బృందం గురువారం పరిశీలించారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి రథసారథులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు గత పదేళ్లుగా నిర్విరామంగా సాగిస్తున్న ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శనీయమని డెప్యూటీ సీఈవో సీవీ ఆనందరావు అన్నారు. అనంతరం తడి, పొడి చెత్త కేంద్రం, వర్మికం పోస్ట్ కేంద్రాన్ని పరిశీలించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీడీవో ఎల్‌వీ రమణ, ఈవో మాధవేంద్రరావు, స్వచ్ఛ ఆంధ్ర ప్రాజెక్టు మేనేజర్ ఎస్ఎండీ జానీ పాల్గొన్నారు.

- **ముగిసిన అభ్యర్థుల ఇంటర్వ్యూలు**

చల్లపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు గురువారంతో ముగిశాయి. మండలంలో మొత్తం 516 అర్జీలు రాగా మొదటి రోజు 209 మందిని, రెండవ రోజైన గురువారం 177 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేసినట్లు ఎంపీడీఓ ఎ.వెంకటరమణ చెప్పారు.

ఘంటసాల: మండల పరిషత్ కార్యాలయంలో ఘంటసాల మండలంలోని వివిధ కార్పొరేషన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్‌కు 166 మంది, కాపు కార్పొరేషన్‌కు 93 మంది, వైశ్య 8, కమ్మ 8, బ్రాహ్మణకు ఒకరు హాజరైనట్లు తెలిపారు.

- **కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం**

మచిలీపట్నంటౌన్: నగరంలోని రుస్తుంబాదలో వేంచేసి ఉన్న శ్రీ భద్రాద్రి శ్రీరాముల వారి దేవాలయంలో కల్యాణ బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తిరుమంజనం, సాయంత్రం విష్వక్సేన పూజ, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షబంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, జగజ్యోతి(నందాదీప స్థాపన) వైనతేయ పట ప్రతిష్ఠ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

- **ఆర్టీసీ కార్మికుల నిరసన**

మచిలీపట్నంటౌన్: సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూఏ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ కార్మికులు గురువారం రెడ్ బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, నైట్ అవుట్ అలవెన్స్‌లను రూ. 300లు చేయాలని, హయ్యర్ పెన్షన్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. లీవ్ ఎన్కాష్‌మెంట్ మంజూరు, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వ సంస్థల ద్వారా నిర్వహించాలనే డిమాండ్లతో నిరసన తెలిపారు.

- **రీ సర్వేపై గ్రామ సభలు**

పెడన: మండల పరిధిలో నుంచి రీ సర్వే చేపడుతున్నామని ఇన్‌చార్జి తహసీల్దారు కే అనిల్‌కుమార్ తెలిపారు. దిరిశవల్లి, ముచ్చలిగుంట గ్రామాల్లో గురువారం గ్రామసభలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. రీసర్వే డీటీ సల్మా, ఆయా గ్రామాల సర్పంచులు జోగి వెంకటేశ్వరమ్మ, పూరిళ్ల భవాని, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

- **బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల ధర్నా**

మచిలీపట్నంటౌన్: బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల (పెన్షనర్ల) హక్కులను కాపాడాలని వెల్ఫేర్ అసోసియేషన్ టెలికం అండ్ బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ సంఘ మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు ఎంద్రపాటి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. స్థానిక పాత బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద గురువారం సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల పింఛను సవరణ పేరుతో హక్కులను హరిస్తోందన్నారు. 8వ పే కమిషన్‌లో బీఎస్ఎన్ఎల్ పెన్షన్ రివిజన్‌ను చేర్చాలని డిమాండ్ చేశారు.

ఓటరు జాబితాలో డూప్లికేట్లను తొలగిస్తాం



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్

పెడన: పెడన నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాలో డూప్లికేట్, మెర్జింగ్ ఓటర్లను వారి అనుమతితో తొలగిస్తామని పెడన నియోజకవర్గ ఏఈఆర్వో, ఇన్‌ఛార్జి తహసీల్దారు కే అనిల్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన తన ఛాంబరులో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు స్థానికంగా ఉండటం లేదని అటువంటి వారిని గుర్తించి తొలగిస్తామని చెప్పారు. అలాగే 2011 జనాభా లెక్కలు ప్రకారం 18 నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన వారు నాలుగు వేల మంది వరకూ కొత్తగా ఓటర్లుగా చేరాల్సి ఉందని, అయితే కేవలం 1,950 మంది మాత్రమే ఓటర్లుగా చేరారని, మిగిలిన 2,050 మందిని కూడా కొత్తగా ఓటర్లుగా చేర్పించాల్సి ఉందన్నారు. ఆయా పార్టీలకు చెందిన జిల్లా అధ్యక్షులు, కార్యదర్శుల వివరాలను ఇవ్వాలని, ఓటర్ల జాబితాలు ఇచ్చేందుకు, బూత్ స్థాయి ఏజెంట్లు వివరాలను కూడా తమకు అందజేయాలని కోరారు. జూన్ లేదా జూలైలో ఓటర్ల జాబితా మార్పులు చేర్పులు చేసిన పిమ్మట విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నికల డీటీ నరసింహారావు, డీటీ సల్మా, ఆర్ఐ విజయలక్ష్మి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలరావు, సీపీఎం నాయకుడు పంచకర్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం బూత్ లెవల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి వారికి దిశానిర్దేశం చేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



డ్వామా పీడీ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నారాయణ తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కృష్ణా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకులు శీలం నారాయణ కోరారు. ఈ మేరకు గురువారం డ్వామా పీడీ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో గత రెండు నెలలుగా పనిచేస్తున్న కూలీలకు వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. జాబ్‌కార్డు కలిగిన కార్మికులకు 200 రోజులు పనిదినాలు కల్పించి రోజువారీ కనీస వేతనం రూ. 450లు ఇవ్వాలని కోరారు. వెంకటేశ్వరరావు, మోహనరావు, సీహెచ్ జయరావు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

గూడూరు: బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈనెల 4, 7 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీ రాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకులమన్నాడు, ఆకుమర్రు, గూడూరు, చిట్టిగూడూరు, కప్పలదొడ్డి, కంకటావ, రాయవరం, తరకటూరు, తుమ్మలపాలెం గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు శుక్రవారం, రామరాజుపాలెం, ఆర్‌వీపల్లి, మల్లవోలు, పోలవరం, పోసినవారిపాలెం, గండ్రం, ఐదుగుళ్లపల్లి, కలపటం, కంచాకోడూరు, కోకనారాయణపాలెం, లేళ్లగరువు, మద్దిపట్ల, ముక్కొల్లు, ఎన్‌కేపాలెం, పీజీలంక, రామన్నపేట గ్రామాల వారికి ఈనెల 7న ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు. అభ్యర్థులు తమ ధృవపత్రాలతో మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

రుణాలకు 2,500 అర్జీలు

మచిలీపట్నంరూరల్: మండల పరిధిలోని 34 పంచాయతీల నుంచి బీసీ, కాపు, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు చెందిన వారి నుంచి 2,500 మంది అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో కే వెంకటేష్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్వ్యూలు ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుందని సూచించారు. పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాటం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోనేరుసెంటర్: అధికార పార్టీ నేతలు ఆక్రమణల తొలగింపు పేరుతో పేదలకు అన్యాయం చేస్తే వైఎస్సార్ సీపీ బాధితుల పక్షాన పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ నాయకుడు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ షేక్ అచ్చేబా పేర్కొన్నారు. నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేర్ని కిట్టు పేదల పక్షాన నిరంతరం నిలబడతాడన్నారు. కాలేఖాన్‌పేటలో కార్పొరేషన్ అధికారులు కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్న మూడు నిరు పేదల కుటుంబాలకు చెందిన గృహాలను కూల్చడం దుర్మార్గపు చర్య అన్నారు. పేర్ని కిట్టు ఆధ్వర్యంలో పేదలకు అండగా నిలబడి చేసిన పోరాట ఫలితంగా నేడు ఆ మూడు కుటుంబాలకు జీ ప్లస్ త్రీ గృహాలు ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మిర్యాల రాంబాబు, చిటికిన నాగేశ్వరరావు, జోగి చిరంజీవి, పర్ణం సతీష్ శీలం మారుతీరావు (బాబ్జి), గాజుల భగవాన్, పల్లి శేఖర్, అజ్గర్‌అలీ, బూరగ రామారావు, వీ నాగేశ్వరరావు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంసీ స్థలంలో జంగిల్ క్లియరెన్స్

మచిలీపట్నంటౌన్: నగర నడిబొడ్డున రేవతీ థియేటర్ సెంటర్‌లో ఉన్న విలువైన మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్థలంలో గురువారం జంగిల్ క్లియరెన్స్ పనులను నిర్వహించారు. నగర కమిషనర్ బాపిరాజు ఈ పనులు పర్యవేక్షించారు. దాదాపు 13 సెంట్ల ఈ స్థలం విలువ ప్రస్తుత మార్కెట్ విలువను బట్టి రూ. 20 కోట్ల వరకూ ఉంటుందంటున్నారు. ఈ స్థలంలో నాలుగు ఫ్లోర్లతో భవనాన్ని నిర్మించేందుకు కెనరా బ్యాంక్‌తో ఉద్యోగుల సంఘం గతంలో ఒప్పందం కుదుర్చుకోగా పలు కారణాలతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం సంఘ నాయకుల ప్రమేయం లేకుండా కమిషనర్ ఈ స్థలాన్ని కొలిపించి, జంగిల్ క్లియరెన్స్ చేయించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆటిజంపై అవగాహన అవసరం



ఆటిజంపై అవగాహన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత

మచిలీపట్నంఅర్బన్: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని సర్వజనాసుపత్రిలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో జీజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ ఆశాలత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల ద్వారా తల్లిదండ్రులకు ఆటిజం లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుస్తాయని చెప్పారు. మానసిక వైద్యనిపుణులు డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ చిన్నతనంలో పిల్లలకు మాటలు సరిగ్గా రాకపోవడం, పిలిచినా స్పందించకపోవడం, ఇతర పిల్లలతో కలవకుండా ఒంటరిగా ఉండటానికి ఇష్టపడటం, వయసుకు తగ్గ మానసిక ఎదుగుదల లేకపోవడం ఆటిజం లక్షణాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్బీఎస్కే జిల్లా కార్యక్రమాధికారి డాక్టర్ హిమబిందు, డెప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హారిక, భార్గవి, డాక్టర్ శ్వేత, నర్సింగ్ కాలేజ్ లెక్చరర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

- **రోడ్డు కం రైల్వే పనులు ప్రారంభం**

మచిలీపట్నంరూరల్: మచిలీపట్నం పోర్టు నుంచి పెడన హర్ష కాలేజీ వరకు రోడ్డు కం రైల్వే పనులను గురువారం ప్రారంభించారు. చిలకలపూడి నుంచి మంగినపూడి బీచ్‌కు వెళ్లే రోడ్డు నుంచి పెడన హర్ష కాలేజీ వరకు నాలుగు కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. పొట్లపాలెం, పోతేపల్లి మీదుగా హర్ష కాలేజీ సమీపంలో ఈ రోడ్డు కలిసే విధంగా ప్రణాళికలు రూపొందించారు.